
# ఆటపట్టు



చిలుకూరి దీవెన

***"అమ్మా! త్వరగా టిఫెన్ రెడీ చెయ్! టైం ఏడున్నర అయిపోతోంది. అక్కడ అప్పుడే గేమ్స్ బిగిన్ చేసి ఉంటారు" నేను అలా కేకలు పెడుతూ రెడీ అవుతూ వున్నాను.***

***కాసేపటికి టిఫెన్ తెచ్చింది అమ్మ. నేను తలదువ్వుకుంటూంటే- "ఇంకా ఏడూఇరవయ్యే కదే- ఇంత తొందరపెడితే ఎట్ల... అయినా నువ్వు ఆడే షటిల్ ఆట ఈరోజు కాదు కదా!" అంటూ తనే తిని పించింది. మా కాలేజీకి సైకిల్ మీద బయలుదేరాను.***

అసలు విషయం ఏమిటంటే ప్రతి ఏడూ జరిగే "జిల్లా స్పోర్ట్స్ మీట్" ఈసారి మా జూనియర్ కాలేజీలోనే జరుగుతోంది. కురుగుంట, కదిరి, ధర్మవరం జూనియర్ కాలేజీ టీమ్స్ నిన్ననే మా కాలేజీ ఆవరణలోకి చేరుకున్నాయి. అందుకే నా ఈ హడావుడి అంతా!

మా కాలేజీ వచ్చేసింది. సైకిల్ని స్టాండులో పెట్టేసి ఆత్రంగా గ్రౌండు వైపు కదిలాను. అది చాలా విశాలమైన గ్రౌండు. అందులో పావుభాగం చెట్లు ఆక్రమించుకుని ఉన్నాయి. మిగిలిన భాగంలో ఆటలకు కావలసిన కోర్టుల్ని, వాటి స్థానాలను నిర్దేశించే సున్నపు గీతలు నేలపై గీచి ఉన్నాయి.

నేను అక్కడికి చేరుకునేటప్పటికే బాల్‌బాడ్మింటన్ ప్రారంభమవుతూ ఉంది. మా కాలేజీ టీమ్ మొదటి గేమ్ కురుగుంట టీమ్‌తో ఆడుతూ ఉంది. మా కాలేజీ వాళ్ళంతా ఉన్నచోటికి వెళ్ళాను. అప్పటికే నాఫ్రెండ్ భారతి వాళ్ళతో కూచునుంది. దానిపక్కనే కూచున్నాను. ఎందుకో తెలీదు కానీ నాకు ఆ కురుగుంట టీమ్‌ని చూస్తుంటే ఏదో చులకన భావం...

"ఏయ్ భారూ! వీళ్ళు మనవాళ్ళతో ఆడి గెలవగలరా? ఎట్లా వున్నారో చూడు మాడుపు మొహాలు పెట్టుకుని-నల్లగా, పొట్టిగా... మనవాళ్ళు చూడవే ఎంత బాగా వున్నారో- అందంగా, తెల్లగా..." అన్నాను భారతితో. అది వినిపించుకున్నట్టు లేదు. మాచ్ బిగిన్ అయింది.

మేము మా కాలేజీ టీమ్ చుట్టూ చేరి గట్టిగా కేకలు పెడుతూ, ఉత్సాహపడుతున్నాం. అబ్బ! మొదటి రౌండు మా టీమ్ గెలిచింది. రెండో రౌండు కోసం కోర్టు మారారు. విజయోత్సాహంతో మరింత గట్టిగా కేకలు పెడుతూ మా కాలేజీ టీమ్‌ని ఎంకరేజ్ చేస్తున్నాం. అయితే, ఈసారి మా ఉత్సాహమంతా నీరు కారిపోయింది. మా కాలేజీ టీమ్ ఓడిపోయింది. మూడవ రౌండులోనూ మా గతి అంతే.

"ఛ! ఆఖరుకి ఈ మాడుపు మొహాల్తో నూ ఓడిపోతే ఎట్లా?" అన్నాను భారతితో- అక్కడినించి వాలీబాల్ మ్యాచ్ జరిగే వైపు కదుల్తూ.

"అది నరే! అంత పొట్టిగా వున్నాగానీ ఎంత బాగా ఎగిరెగిరి కొట్టి గెలిచినారో చూడు" అంటూ భారతి మెచ్చుకోలుగా అంటూ వుంటే- దాని మాటలకి మా అమ్మ గుర్తుకు వచ్చింది.

"భారూ! ఇప్పుడు గనుక మా అమ్మే ఉండి వుంటే కురుగుంట టీమ్ గెలిచినందుకు భలే సంతోషపడేది లేవే!" అన్నాను. తనకి అర్థంకాక "అదేమిటే?" అంటూ అయోమయంగా మొహంపెట్టింది.

"అదంతేలేవే! మా అమ్మ కథే వేరు. ఆటే ముఖ్యంకానీ, ఆడింది ఎవరు? ఏ టీమూ? అన్నవి అవసరం లేదంటుంది. నీకో విషయం చెప్పనా- ఓసారి నేను టీవీలో క్రికెట్ చూస్తున్నాను. సరిగ్గా అప్పుడే గంగూలీ బౌల్డు అయినాడు. మా అమ్మ చప్పట్లు కొట్టింది. "ఎందుకని?" నేను అడిగితే "వసీమ్ అక్రం బౌలింగ్ అద్భుతంగా చేసినాడ"ని చెప్పింది.

"మీ అమ్మ పాయింటు కూడా కరెక్టేకదే?" అంది భారతి. మా అమ్మలో నాకు నచ్చని విషయాలు భారతికి ఎట్లా నచ్చాయో అర్థం కాలేదు నాకు. ఏం మాట్లాడకుండా ఆలోచనలో పడిపోయాను.

మా అమ్మానాన్నలది లవ్ మారేజీ. వాళ్ళిద్దరూ ప్రేమించి ఎట్లా పెండ్లి చేసుకున్నారో నాకయితే అర్థమే కాదు. మా అమ్మానాన్నల అభిప్రాయాలలో చాలా తేడాలు ఉన్నాయి. మా నాన్న దేవుడినే పూజించాలంటాడు. మానవసేవే మాధవసేవ అన్నదాన్నే మా అమ్మ నమ్ముతుంది. మా అమ్మ మాటలూ చేతలూ అంతుచిక్కనివిగా ఉంటాయి నాకు. అందుకే మా నాన్న అభిప్రాయాలకే ఎప్పుడూ నా ఓటు వేస్తుంటాను. మా ఫ్రెండు చప్పట్లు కొడుతూ, కేకలు పెడుతూవుంటే ఆలోచనల్లోంచి తేరుకున్నాను.

ఆ కేకలకు కారణం, వాలీబాల్ మ్యాచ్‌లో కె.ఎస్.ఆర్.కాలేజీ టీమ్‌లో మా టీమే గెలిచింది. మేమందరం చాలా సంతోషంగా కోకో కోర్టువైపు నడిచాం. టాస్ వేసి ఆట మొదలుపెట్టారు. కదిరి కాలేజీ టీం టాస్ గెలిచి మా టీమ్‌కి పరిగెట్టే అవకాశం ఇచ్చింది. ఎర్రటి ఎండలో, కాలిపోతున్న మట్టిలో వాళ్ళు ఆడుతూ వున్నారు. మాకు ఎండవేడిమికి చెమటలు కారుతున్నాయి. ఆకాశంలో అక్కడక్కడా మబ్బులున్నాయి. సూర్యుణ్ణి అడ్డుకోడానికి ఏ మబ్బూ సాహసించడంలేదు.

మా టీమే గెలిచింది. అంతటి ఎండలోనూ మా మొహాలు వికసించాయి.

మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాను. ఆటల విశేషాలు అమ్మకి చెబుతూనే భోజనం చేశాను. మళ్ళీ కాలేజీకి చేరుకున్నా.

చాలా ఆటల్లో కురుగుంట కాలేజీ టీం గెలుస్తూనే వుండటంతో మావాళ్ళందరికీ ఆ టీమ్ పైనే ద్వేషం అంతకంతకు ఎక్కువయిపోతోంది. అది ఎంతకి దారితీసిందంటే కురుగుంట టీమ్ ఏ కాలేజీ టీమ్‌తో ఆడినా మేము ఆ కాలేజీ టీమ్‌నే ఎంకరేజ్ చేస్తూ వున్నాం. ఏ ఆటలోనైనా కురుగుంట టీం ఓడిందా వాళ్ళు తలలు దించుకునేలా కేకలుపెట్టి, కేరింతలు కొడుతున్నాం.

స్పోర్ట్స్ మీట్ వ్యవధి రెండురోజులే కాబట్టి సాధ్యమైనంతవరకూ కొన్ని ఆటలకి ఫైనల్సు ఈరోజే జరుగుతాయి.

కబడ్డీ ఫైనల్సు మొదలయినాయి.

"మళ్ళీ ఈ కురుగుంటతోటేనే భారూ! మనవాళ్ళు ఎట్ల ఆడతారో ఏమోనే... భయంగా వుంది నాకు" అన్నాను.

"భయం ఏమీలేదుగానీ- నాకు మాత్రం డౌటే!" అంది భారతి సీరియస్‌గానే. తన ధోరణి చూస్తుంటే మా టీం కచ్చితంగా ఓడిపోతుందని చెబుతోందని పిస్తోంది. అయినా ఉత్కంఠగానే ఉంది. ఎంత టెన్షన్ భరించినా వేస్టే అయింది. ఆ కురుగుంట టీమే గెలిచింది.

నేను ఇల్లు చేరేటప్పటికి సాయంత్రం ఆరుగంటలయింది. అప్పటికి ఇంకా చీకటి వడలేదు కానీ సూర్యుడు మాత్రం ఆకాశంలో లేడు. కురుగుంట టీమ్‌ని తిట్టుకుంటూ కుర్చీలో కూలబడ్డాను. నాన్న అప్పటికే ఆఫీసు నుంచి ఇంటికొచ్చి, బజారుకి వెళ్ళాడు కూడా. తమ్ముడు టెన్త్ కాబట్టి వాడు ఎప్పుడో ట్యూషనుకి వెళ్ళిపోయాడు.

నాకు చాలా అసహనంగా వుంది. "ఆ కురుగుంట ఎందుకొచ్చిందోగానీ వాళ్ళని చూస్తూనే ఒళ్ళు మండిపోతావుంది" అన్నాను అమ్మని చూస్తూనే.

"ఎందుకే అంత బాధ! వాళ్ళు గెలిచినారనా? మీరు ఓడినారనా? ఎప్పుడుగానీ ఇట్ల ఎవరూ బాధపడకూడదమ్మా! నిజానికి ఈ స్పోర్ట్సు మీట్ వంటివి ఎందుకు జరుపుతారో తెలుసా?" అంది అమ్మ.

"ఎందుకో... ఏమో!" అన్నాను అన్యమనస్కంగా.

"అయితే చెప్తా- విను... మీరెవరూ ఆ కురు

గుంట కాలేజీ వాళ్ళకీ, ఆ కురుగుంట వాళ్ళెవరో మీ కాలేజీ వాళ్ళకి ఏమయినా తెలుసునా? తెలియదుకదా... మీమధ్య ఇంతకుముందు ప్రేమగానీ, ద్వేషంగానీ అసూయగానీ లేవు. ఇట్లా స్పోర్ట్స్ మీట్ వల్ల మీలో స్నేహభావం పెంపొందుతుందని ఏర్పాటుచేస్తారు. మనకు ఆటను ఆనందించటం ముఖ్యం- ఎవరు బాగా ఆడతారో వాళ్ళని అభినందిద్దాం. ఆటలో మన, పర అనే తేడాలు చూడకూడదమ్మా!" మా అమ్మ క్లాసు పీకుతూ కాఫీ ఇచ్చింది. ఇంకా క్లాసు వినే ఓపికలేక కాఫీ తాగుతూ టీ.వీ. చూస్తూ ఉండిపోయాను.

** ** **

ఉదయం ఏడున్నర గంటలవుతోంది. కానీ నిన్న ఉన్నంత ఉత్సాహం ఈరోజు లేదు. అయినా కాలేజీకి వెళ్లక తప్పదు గనుక కాస్త ఆలస్యంగా తయారయి బయలుదేరుతూ ఉంటే-

"నువ్వు షటిల్ ఆడేది మధ్యాహ్నమేగదా! అప్పటికల్లా నేను వస్తాలేవే!" అంది అమ్మ. సరేనని చెప్పి కాలేజీకి చేరుకున్నాను.

అప్పటికే ధర్మవరం టీమ్‌తో కురుగుంట టీమ్ కోకో ఆడుతోంది. కురుగుంట టీమ్ విజయపరంపర కొనసాగుతూ వుంది. త్రోబాల్‌లో కూడా గెలుపు వాళ్ళనే వరించింది.

మధ్యాహ్నం భోజనానంతరం షటిల్ వుంటుంది. అందులో నేనూ, గాయత్రీ భాగస్వాములం. మా ఇద్దరికీ కాలేజీ వాళ్ళే భోజనాలు పెట్టారు. నాకు టెన్షన్ ఎక్కువవుతోంది. ఎందుకంటే ఇప్పటివరకూ జరిగిన ఆటల్లో ఒక్క వాలీబాల్ తప్ప మా కాలేజీ వాళ్ళు మరేదీ గెలువలేదు.

షటిల్ మొదలయింది. మొదట మాకూ, ధర్మవరం టీమ్‌కి మధ్య జరుగుతోంది. మా శక్తులన్నీ ఒడ్డి ఆడాం... ఏమైతేనేం మేమే గెలిచాం. ఎప్పుడొచ్చిందో అమ్మ... దగ్గరికొచ్చి రెండు చేతుల్ని తన చేతులతో ఆత్మీయంగా స్పృశిస్తూ "వెరీగుడ్! బాగా ఆడావు" అంది.

అనుకున్నంతా అయింది. అటు కదిరితో సెమీ ఫైనల్స్‌లో గెలిచిన కురుగుంటతో మేము ఫైనల్స్‌లో ఆడాలి.

ఎట్టకేలకు నేనూ, గాయత్రీ కష్టపడి ఆడి గెలిచాం. నా ఆనందానికి అవధులు లేవు. అదికూడా విజయగర్వంతో ఊగిపోతున్న కురుగుంట టీమ్‌పై గెలవడంతో ఉత్సాహం ఉరకలు వేస్తోంది నాకు.

"అమ్మా! మేం గెలిచినాం" అని కేకలేస్తూ అమ్మను చేరుకున్నా.నా తలను అభినందన పూర్వకంగా దువ్వుతూ నవ్వింది.

అమ్మ కళ్ళల్లో గర్వం తళుక్కున మెరిసినట్టయింది. మా నాన్నే ఇక్కడికి వచ్చివుంటే ఇంకెంత గర్వం చేవాడో మరి!

"నువ్వు ఇంటికెళ్ళమ్మా భారతి తోడు వుందికదా- మళ్ళీ వస్తాలే" అని అమ్మకు నచ్చచెప్పి ఇంటికి పంపివేశాను. టెన్నికాయిట్, కబడ్డీ ఒకటేమిటి ఇంకా ఎన్నో ఆటల్లో ఫైనల్సు గెలిచింది కురుగుంట కాలేజీ టీమ్ అన్న విషయం మాకెవ్వరికీ మింగుడుపడటం లేదు. ఈసారి ఛాంపియన్‌షిప్ వాళ్ళకే అన్నది అందరికీ అర్థమయిపోయింది. మా గేమ్స్ టీచర్ కూడా అదేమాట అనడంతో నేనూ, భారతీ ఇంటిదారి పట్టాం.

** ** **



ఇంట్లోకి అడుగుపెడుతుంటే "ఎవరికిదక్కింది ఛాంపియన్‌షిప్" అంది అమ్మ.

"ఇంకెవరికీ ఆ కురుగుంట వాళ్ళకే పోతుందట"అన్నా సోఫాలో కూలబడుతూ.

"మంచిదేగా" అని అమ్మ అనడంతో నాకు కోపం వచ్చి- "అదేంటమ్మా! వాళ్ళకి వెళ్ళడం అంత మంచిగా అనిపిస్తావుందా?" అంటూ విసుక్కున్నాను.

మనదేశంలో ఏ రంగంలోనైనా దళితుల్ని అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్రీడా రంగంలోనూ అదే జరిగింది. నీకుబాగా అర్థంకావాలంటే క్రికెటర్ కాంబ్లీ కుల వివక్షకు గురయినాడన్న దానికిమంచి ఉదాహరణ. చాలా క్రీడల్లో కుల వివక్ష ఉంది. దీనివల్ల మనదేశానికి రావాల్సిన బంగారు పతకాలు రావడంలేదు.

"అదికాదమ్మా! నేనీ పొద్దు వాళ్ళనీ, వాళ్ళ ఆటనీ చూసినానుకదా! బాగా ఆడినారు. ఆ ఆడటంలో ఎంత నైపుణ్యం వుంది. సరేగానీ వాళ్ళని చూస్తే నీకేమనిపిస్తుందే... అంటే వాళ్ళు ఎలా వున్నారు?" అడిగింది నెమ్మదిగా. అసలు కోపంగా వుంది నాకు.

అందుకే- "నల్లగా, పొట్టిగా ఉన్నారు" అన్నాను కసిగా.

"వాళ్ళెవరో నీకు తెలుసామ్మా! వాళ్ళంతా దళితులే!" అంది నా కళ్ళలోకి చూస్తూ.

"ఏం దళితులయితేనేం గొప్పా?"

గొప్ప గురించి కాదు కానీ... ఒకటడుగుతా చెప్పు... మొన్న సిడ్నీలో జరిగిన ఒలింపిక్ గేమ్స్‌లో ఎక్కువ మెడల్స్ ఏదేశానికి వచ్చినాయి?" అడిగింది అమ్మ.

తడుముకోకుండా "అమెరికాకు" అన్నాను.

"టెన్నిస్‌లో గోల్డుమెడల్ ఎవరికి వచ్చింది?"

"వీనస్ విలియమ్స్‌కు"

"ఏ దేశస్థురాలు"

"అమెరికా..."

"మరి, పరుగుపందెంలో ఫాస్టెస్ట్ మేన్?" అడిగింది అమ్మ.

"మారిస్‌గ్రీన్... అతనూ అమెరికా వాడే"

"ఫాస్టెస్ట్ ఉమన్?"

"మారియన్ జోన్స్... ఈమెదీ అమెరికానే"

"ప్రఖ్యాత అథ్లెట్ లివీస్‌ది ఏ దేశం?"

"బ్రిటన్"

"మరో అథ్లెట్ ఎనిస్ బార్బర్‌ది?"

"ఫ్రాన్స్"

"వెరీగుడ్ బాగా చెప్పావే బుజ్జీ!"

"అది సరేనమ్మా! నువ్విలా ఎందుకు అడుగుతున్నావో నాకు అర్థం..." సగంలో ఆపేశాను.

వెంటనే అందుకుంది అమ్మ- "... కాలేదుకదా... అయ్యేట్టు చెప్తాకదా... దాదాపు ఏభైఏళ్ళు తిరుగులేని రారాజుగా వెలిగిపోయిన అమెరికన్ బాక్సర్ మహమ్మదాలీ, ఇప్పటి ఇంగ్లండ్ బాక్సర్ లెనక్స్ లూయిస్, జింబాబ్వే ప్రఖ్యాత క్రికెటర్ మారిస్ ఒడుంబే- ఇందాకా మనం చెప్పుకున్న పేర్లు- వీళ్ళంతా ఎవరు? దేశాలు వేరయినా ఒకే జాతివాళ్ళు. అంతా నీగ్రో సంతతి వాళ్ళమ్మా! ఆఫ్రికా నుంచి బానిసలుగా ఆయా దేశాలకు తీసుకుపోబడినవాళ్లే... ఆయా దేశాలలో భయంకరమైన వర్ణ వివక్షకు గురైనవాళ్ళే. అయితే ఆ దేశాల వారు నీగ్రో సంతతిలో ఉన్న క్రీడాస్ఫూర్తిని గమనించి వారితోనే తర్వాతికాలంలో ఒలింపిక్స్‌వంటి క్రీడోత్సవాల్లో పతకాల పంటలు పండించుకుంటున్నారు. ఇవన్నీ గమనించినపుడు నాకేమనిపిస్తుందంటే, మనదేశంలోని దళితులూ, బహుజనులూ నీగ్రో సంతతిలాగే క్రీడాస్ఫూర్తి బాగా ఉన్నవాళ్ళు అని"

"అయితే ఏమిటంట? నాకు నీమాటల్లో లింకు బోధపడలేదమ్మా!" అన్నాను చిరాకుతో.

"అదీ చెప్తా- అందువల్లనే ఆ కురుగుంట టీం ఛాంపియన్‌షిప్ సాధించింది. ఇంకో విషయం తెలుసామ్మా! మనదేశంలో ఏ రంగంలోనైనా దళితుల్ని అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్రీడా రంగంలోనూ అదే జరిగింది. నీకుబాగా అర్థంకావాలంటే క్రికెటర్ కాంబ్లీ కుల వివక్షకు గురయినాడన్న దానికిమంచి ఉదాహరణ. చాలా క్రీడల్లో కుల వివక్ష ఉంది. దీనివల్ల మనదేశానికి రావాల్సిన బంగారు పతకాలు రావడంలేదు. పోయినసారి ఒలింపిక్స్‌లో కనీసం కంచు పతకమైనా వచ్చింది..."

"అదీ- కరణం మల్లీశ్వరి పుణ్యమా అని" అందించాను.

"అదే దళితుల్నీ, బహుజనుల్నీ ఒలింపిక్స్‌కి ఎంపికచేసి వుంటే కచ్చితంగా మనకు ఎన్నో బంగారు పతకాలు వచ్చి వుండేవి తెలుసా!" అంటూ అమ్మ చెబుతోంటే బయట నాన్న స్కూటరు ఆగినట్టు శబ్దం వినబడింది. తలుపు తీసేందుకువెళ్లింది అమ్మ.

ఏమిటో అమ్మ ధోరణి నాకు అర్థం కాలేదూ- నచ్చనూలేదు. ●